క్లుప్తంగా

ఇరువురిపై దాడి




గాయపడి మన్సూర్, ఫర్హాన్

హిందూపురం: పట్టణంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఇద్దరు యువకులపై ఆదివారం రాత్రి దాడి జరిగింది. రహమత్‌పురంలో స్థానికుల మధ్య గొడవ జరుగుతుండగా మన్సూర్, ఫర్హాన్ అక్కడికి వెళ్లారు. ఉన్న ఫలంగా తమపై కత్తులతో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డామని బాధితులు తెలిపారు. అన్సార్, ఇనాం, సమీర్ తదితరులు దాడిచేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా తెలిపారు. ఈమేరకు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. గాయపడిన వారు ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడకశిర: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, వాల్మీకి సేవా సంఘం నాయకుడు మనోహర్ ఇటీవలనే గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మడకశిరకు చేరుకుని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు మోహన్‌కుమార్, స్థానిక వాల్మీకి సంఘం నాయకుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి



మాట్లాడుతున్న ఎంపీ గోవింద కారజోళ

పావగడ: స్థానిక జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘం డైరెక్టర్ స్థానానికి జరిగే ఎన్నికల్లో బీజేపీ , జేడీఎస్ కూటమి అభ్యర్థి చన్న మల్లప్పను గెలిపించాలని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ విజ్ఞప్తి చేశారు. స్థానిక అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మునుగుతున్న పడవ అని ఎద్దేవా చేశారు. గడినాడు పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రతి తాలూకాలో పర్యటించి అతివృష్టితో నష్ట పోయిన పంటల పై పూర్తి సమాచారం సేకరించి నష్ట పరిహారాన్ని బాధిత రైతులకు అందించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, చన్నమల్లప్ప, కోటగుడ్డ అంజినప్ప, బీజేపి శివకుమార్ సాకేల్ తదితరులు పాల్గొన్నారు.

కెంపేగౌడ జయంతిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంజునాథ

అమరాపురం: కుంచిటి వక్కలిగుల ఆరాధ్య దైవం కెంపేగౌడ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కుంచిటి వక్కలిగుల సంఘం పెద్దలు మంజునాథ, చంద్రశేఖర్, గణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో కెంపేగౌడ యువక సంఘం, వక్కలిగ సేవా సమితి, పాఠశాల కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెంపేగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కులస్తులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోండి



మంత్రి సవితను కలసిన గొర్రెల సహకార సంఘం నాయకులు

పెనుకొండ: గొర్రెల కాపరులను ఆదుకుని వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కర్నూలు జిల్లా గొర్రెల సహకారం సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు నాగేశ్వరయాదవ్ తదితరులు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను కోరారు. ఆదివారం వారు మంత్రిని పట్టణంలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. సరైన సహకారం లేకపోవడంతో గొర్రెల కాపరులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మద్దిలేటి, అడ్వకేట్ మురళీమనోహర్, శంకర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శఠగోపం



ఎన్నికలకు ముందు ఎన్నో హామీలతో ఊదరగొట్టిన చంద్రబాబు... ముఖ్యమంత్రి అయ్యాక తన నిజ స్వరూపాన్ని మరోసారి చూపించారు. రైతు సాయం రూ.20 వేలు ఇస్తామని ఆర్భాటంగా చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదు. తాజాగా ఉచిత పంటల బీమా రద్దు చేసి అన్నదాతలను నట్టేట ముంచారు. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తుతున్నారు.

- కూటమి ప్రభుత్వంలో ఇంత వరకూ మంజూరు కాని రైతు భరోసా
- ఒక్కొక్కరికీ రూ.20 వేలు ఇస్తామని మోసం
- ఉచిత పంటల బీమా రద్దుతో అన్నదాతలను నట్టేట ముంచిన వైనం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు అన్ని విధాలా అండ
- చంద్రబాబును నమ్మి మోసపోయామంటున్న రైతాంగం

మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతుల సంక్షేమాన్ని ఈప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా నట్టేట్ట ముంచారు. ప్రతి ఏడాది రైతులకు రూ. 20 వేల సాయం అందిస్తానని ప్రకటించినా నేటికీ దాన్ని పట్టించుకోవడం లేదు. అలాగే ఉచిత పంటల బీమా పథకానికి కూడా స్వస్తి పలికారు. రైతులే ఇక నుంచి బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు భారంగా మారింది. వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా ప్రతి ఏడాది క్రమ తప్పకుండా అమలయ్యేది. ప్రభుత్వమే బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించేది. రైతులపై ఏమాత్ర భారం మోపకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుని క్రమ తప్పకుండా ఏటా బీమాను అందించి ఆదుకునేది. చంద్రబాబు చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ హయాంలో నియోజకవర్గంలోని 45,763 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.287.71 కోట్లు అందాయి.



మడకశిరలో సాగు చేసిన వేరుశనగ (ఫైల్)

అలాగే ఉచిత పంటల బీమా ద్వారా 38,198 రైతులకు రూ.79.29 కోట్ల సాయన్ని బీమా కింద అందించారు. అదే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు రూ. 1.04 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అందించిన ఘనత కూడా వైఎస్ జగన్‌దే.

వరికి రూ.630.. టమాటకు రూ.1600

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఉచిత పంటల బీమాను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా అమల్లోకి వచ్చిన పంటల బీమాపై రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇక నుంచి రైతులే ప్రీమియం చెల్లించాలని అవగాహన కల్పించనున్నారు. ప్రీమియం చెల్లించకపోతే బీమా రాదని రైతులకు చెప్పనున్నారు. ప్రస్తుతం రబీ సీజన్ నుంచి నూతన పంటల బీమా అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సకాలంలో ప్రీమియం చెల్లించాలని అధికారులు కోరుతున్నారు. వరి పంటకు డిసెంబర్ నెలాఖరులోగా, వేరుశనగ, టమాట పంటలకు డిసెంబర్ 15 లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. వరికి ఎకరాకు రూ.630, ఎకరా వేరుశనగకు రూ.480, ఎకరా టమాటకు రూ.1,600 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

ఉచిత పంటల బీమా లబ్ధి ఇలా.....

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లల్లో)
2020	38,198	29.16
2021	27,822	15.65
2022	18,314	20.34
2023	23,165	14.14
మొత్తం	38,198	79.29

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతులు	లబ్ధి (రూ.కోట్లల్లో)
2020	41,370	55.85
2021	45,763	61.78
2022	44,286	58.92
2023	43,614	58.87
2024	45,476	52.29
మొత్తం	45,763	287.71

రైతులకు అన్యాయం



వైఎస్ జగన్ హయాంలో ఉచిత పంటల బీమా అమలయ్యేది. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేది. రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడేది కాదు. పంట సాగు చేసిన ప్రతి రైతుకూ బీమా అందేది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత పంటల బీమాకు స్వస్తి పలకడం అన్యాయం. రైతులు ప్రీమియం చెల్లించే పరిస్థితిలో లేరు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత పంటల బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలి.

– తిప్పేస్వామి, పీఎస్ పాళ్యం, గుడిబండ మండలం

హామీ నిలబెట్టుకోవాలి



చంద్రబాబు రైతులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్రతి ఏటా రైతుకు రూ.20 వేలు సాయం చేస్తామన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని జమ చేయాలి. వైఎస్ జగన్ హయాంలో ప్రతి ఏడాది రైతు భరోసా కింద సాయం అందేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇంత వరకూ పెట్టుబడి సాయం అందించలేదు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా హామీని నిలబెట్టుకోకపోవడం రైతులను మోసం చేయడమే.

– నాగరాజు, గుడ్డదహళ్లి, గుడిబండ మండలం

రైతులకు అండగా నిలబడాలి



వైఎస్ జగన్ హయాంలో రైతులకు అన్ని విధాలుగా మంచి జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలబడాలి. లేకపోతే రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది. ఉచిత పంటల బీమా పథకం రైతులకు వరం లాంటిది. అలాంటి పథకాన్ని రద్దు చేయడం రైతులకు అన్యాయం చేయడమే. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించకపోతే రైతులు ఎదురు తిరగడం ఖాయం.

–విశ్వేశ్వరయ్య, ఫళారం, గుడిబండ మండలం

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలకప్ప



గుడిబండ: నాడు విప్లవాత్మక మార్పులతో కళకళలాడిన సర్కారు బడులు.. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో మసకబారుతున్నాయని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఇందులో భాగంగానే ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జగనన్న పాలనలో నాడు- నేడు ఇంగ్లిష్ మీడియం వైపు అడుగులు పడ్డాయన్నారు. ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, విద్యాకానుక, గోరు ముద్ద ఇలా పేద పిల్లల తలరాతలను మార్చేలా ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశారన్నారు. నాడు- నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. అయితే కూటమి పాలనలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అధ్వాన్నంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపడం మానేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఒక్కో విద్యార్థికి రూ. 15 వేల చొప్పున ఇస్తామని చెప్పి నేటికీ దానిపై నోరు మెదపడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను అష్టకష్టాలు పెడుతోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల కష్టాలు పట్టవా?

రొళ్ల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి విమర్శించారు. ఆదివారం వారు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నేటికీ రైతు సాయం రూ.20 వేల సాయంపై మాట్లాడకపోగా పంటల బీమాను రద్దు చేయడం హేయమన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎంతోమంది రైతులు ఎదురుచూస్తున్నా పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. ఇటీవల తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవిత సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మైలారప్పకు రూ.15 వేలు, ఈశ్వరమ్మకు రూ.25 వేలు, దీపికకు రూ.20 వేలు, పెద్దన్నకు రూ.87,709, మహబూబ్‌బాషాకు రూ. 16,670, నాగభూషణానికి రూ. 1,53,290, కళావతికి రూ. 20 వేలు, సుకన్యకు రూ. 1,67,727 చెక్కులను అందించారు. ఎవరైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ఉంటే తగిన బిల్లులు జతపరచి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

పాఠశాలల పరిరక్షణకు రాజీలేని పోరాటం



సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

పెనుకొండ: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు రాజీలేని పోరాటం చేస్తామని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల స్వర్ణోత్సవ మహాసభ ఆదివారం పట్టణంలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే సమాజంలో నైతిక విలువలు, ప్రజా తంత్ర హక్కులను నిలబెట్టుకోగలమన్నారు. పాలక వర్గాల విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీనపడిందన్నారు. ఈ వ్యవస్థను బతికించుకోవడానికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని, పీఆర్‌సీ, ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెనుకొండ యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కృష్ణానాయక్, అధ్యక్షుడిగా ఉపేంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా పెద్దిరాజు, నాగమణి తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం



మడకశిర మండలం హరేసముద్రంలో జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



లేపాక్షి మండలం వెంకటాపురంలో ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకులు

మడకశిర నియోజకవర్గంలోని మడకశిర పట్టణంతో పాటు అమరాపురం, గుడిబండ, అగళి, రొళ్ల మండలాల్లో వాల్మీకి జయంత్యుత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలాగే హిందూపురం, లేపాక్షి మండలాల్లోని వేడుకలు జరిపారు. ఆయా ప్రాంతాల్లో వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీలు చేశారు. – సాక్షిబృందం



హిందూపురం: మోత్కుపల్లిలో జ్యోతులతో మహిళల ఊరేగింపు



మడకశిర: వాల్మీకి జయంత్యుత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ర్యాలీ



హిందూపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

హిందూపురం: రాష్ట్రీయ స్వయం సేవాక్ సంఘ్ స్థాపించి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పట్టణంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మిత్ర గ్రూప్ ఆఫ్ ఎండీ ఓబులేసు, నెల్లూరు డిస్ట్రిక్ట్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు యుగంధర్ , బీజేపీ సెంట్రల్ సీడ్స్ మెంబర్ రమేష్‌రెడ్డి, చలపతి, చారుకీర్తి, ఆదర్శ, నగేష్, అశోక్ వివిధ హిందూ సంఘాల సభ్యులు, హిందూ యువత పాల్గొన్నారు.



అమరాపురం: కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవకులు

అమరాపురం: మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సరస్వతి విద్యామందిరం చేరుకొని భారతమాత చిత్రపటం వద్ద వందనం చేశారు. డాక్టర్ శివకుమార్, బాలాజీరావు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థను స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా దేశానికి సేవ చేశామన్నారు.

అన్నదాన సత్రానికి సాయం



కమిటీ సభ్యులకు బియ్యం ప్యాకెట్లను అందిస్తున్న దాతలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రం కమిటీ సభ్యులకు కర్ణాటక రాష్ట్రం చిక్కబళాపురానికి చెందిన కేఎల్.నారాయణప్ప, అనిల్‌కుమార్, గంగాధర్, శ్రీనివాసమూర్తి, వెంకటేశ్ రూ. 40 వేలు విలువ చేసే బియ్యం ప్యాకెట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అన్నదాన సత్రం కమిటీ సభ్యులు సన్మానించారు.

జూదరుల అరెస్టు



పట్టుబడిన జూదరులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని శివాలయం వద్ద ఓ కళ్యాణ మంటపంలో పేకాట ఆడుతున్న పదిమంది జూదరులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జూదరుల నుంచి రూ.16,800 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'పురం'లో మూడురోజుల పాటు నీటి సరఫరా బంద్

హిందూపురం: పట్టణంలో మూడురోజులు తాగు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్కేడీ నగర్‌లోని పంపింగ్ స్టేషన్ వద్ద విద్యుత్ అంతరాయం వల్ల నీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పునరుద్ధరించేందుకు మూడు రోజుల సమయం పడుతుందన్నారు.

కాంగ్రెస్‌లోకి హైదరాబాద్ స్వామి

పావగడ: స్థానిక ప్రముఖ వడ్డీ వ్యాపారి హైదరాబాద్ స్వామిగా పిలిచే కోటగుడ్డ అశ్వర్థరావ్ జేడీఎస్‌కు స్వస్తి పలికి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప స్వగృహంలో స్థానిక ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ సమక్షంలో పార్టీ కండువా కప్పు కున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీ వ్యాధి నిపుణురాలు జ్యోతి 125 మంది రోగులను పరీక్షించి వారికి సలహా సూచనలు ఇవ్వడంతో పాటు రూ.30 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. అలాగే పావగడ నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ ఓంకార్ నాయక్ 100 మంది రోగులను పరీక్షించి రూ.20 వేలు విలువ చేసే మందులను అందించారు. అలాగే హిందూపురం నుంచి వచ్చిన కంటి వైద్యులు జింకా కృష్ణమోహన్ రోగులను పరీక్షించి 21 మంది రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తామన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



యశ్వంత్ ప్రియ

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కుమారి యశ్వంత్ ప్రియ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విజయం సాధించి బెంగుళూరు డివిజన్ విభాగం పోటీలకు ఎంపికైంది. మధుగిరిలో జరిగిన జిల్లా స్థాయి గ్రామీణ ఐటీ క్విజ్ పోటీల్లో సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచింది. యశ్వంత్ ప్రియ ప్రతిభపై పాఠశాల హెచ్‌ఎం రామచంద్రప్ప, సహ ప్రధానోపాధ్యాయుడు రేణుకారాజ్, ఉపాధ్యాయులు హనుమేశ్, మోహన్ కుమార్, జీకే కుమార్, అభిషేక్, విమల, రశ్మి, మానస, శ్రీలక్ష్మి తదితరులు హర్షం తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశపు భవనంతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

రొద్దం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నట్లు రైతులు తెలిపారు. ఆదివారం ట్రాక్టర్లను అడ్డుకుని, ఇసుక తరలిస్తున్న వ్యక్తులతో రైతులు వాగ్వాదానికి దిగారు. పెన్నానదిలోని ట్రాక్టర్ల టైర్లలో గాలి తీసేశారు. ఇసుక అక్రమదారులు ట్రాక్టర్లను అక్కడే వదిలేసి వెళ్లినట్లు రైతులు వివరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోకపోవడంతో అడ్డుకుంటున్నట్లు తెలియజేశారు.

కెంచమాంబదేవికి పూజలు



ఊరేగింపుగా వస్తున్న పూజారులు, భక్తులు

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యుడు అమరాపురం లింగరాజు ఇంట్లో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు లింగరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.